క్లుప్తంగా

నేడు పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నట్లు ఆయన క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఖమ్మం నగరంలోని ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగే ఐఎన్‌టీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. అలాగే కూసుమంచి, ఖమ్మం, సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల్లో జరిగే పలు ప్రైవేట్ కార్యక్రమాల్లోనూ పాల్గొననున్నట్లు చెప్పారు.

బియ్యం అందజేత

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపూడి ఉపసర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుత్తా వెంకటేశ్వర్లు ఇటీవల గ్రామంలో మృతి చెందిన తెల్లబోయిన లింగం కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి 50 కేజీల బియ్యం అందించారు. అలాగే పంచాయతీ వార్డు సభ్యులు గుండ్ల ముత్తయ్య, కంపసాటి వేణులు తమవంతుగా మరో 50 కేజీల బియ్యం లింగం కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గంగిరెడ్డి విజయ్‌రెడ్డి, జానీ, సచ్చు వీరబాబు, పెద్దలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను గడపగడపకూ తీసుకెళ్లాలి

ఖమ్మంరూరల్: కాంగ్రెస్ పార్టీ రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రకటించిన హామీలను గడపగడపకూ తీసుకెళ్లి ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని మాజీమంత్రి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సంభాని చంద్రశేఖర్ కాంగ్రెస్ కార్యకర్తలు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్‌లో జరిగిన యూత్ కాంగ్రెస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీ మోసాలను ప్రజలకు వివరించాలని, కాంగ్రెస్ గెలుపు కోసం రాబోయే నాలుగు నెలలు ఎంతో కీలకమని తెలిపారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి, జెర్రిపోతుల అంజని మహేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పాలేరులో బీఎస్పీదే విజయం

తిరుమలాయపాలెం: ఎస్సీ, ఎస్టీ, బీసీ బహుజనులు అధికంగా ఉన్న పాలేరు నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో పాలేరులో బీఎస్పీదే విజయం అని ఆ పార్టీ నియోజకర్గ ఇన్‌చార్జ్‌ అల్లిక వెంకటేశ్వరరావు యాదవ్ అన్నారు. ఆదివారం తిరుమలాయపాలెంలో విలేరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు రూ.లక్ష రుణం కోసం 5 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం రూ.500 కోట్లే కేటాయించారని, 2 శాతం ఉన్న అగ్రవర్ణాలకు 10శాతం రిజర్వేషన్ అమలు చేయడం వల్ల బహుజనులకు నష్టం జరుగుతుందని అన్నారు. కేవలం రూ.100 కోట్ల బడ్జెట్‌తో గురుకులాలను అభివృద్ధి చేసిన ఘనత డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు దక్కుతుందన్నారు. పాలేరులో బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా నాయకులు పీసీ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం

ఖమ్మం మామిళ్లగూడెం: అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకంలో భాగంగా ఖమ్మం రైల్వే స్టేషన్‌కు రూ.25.40 లక్షలు కేటాయించడం పట్ల ఆదివారం ఖమ్మం రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం ఎదుట ప్రధాని మోదీ ఫ్లెక్సీకి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో పాటు వాసుదేవరావు, ఉప్పల శారద, రుద్రప్రదీప్, నంబూరి రామలింగేశ్వరావు, అల్లిక అంజయ్య, రేఖ వెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్ల సమస్యల పరిష్కారానికి కృషి..


కార్యకర్తలతో మాట్లాడుతున్న తుమ్మల

నేలకొండపల్లి: మండల కేంద్రంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం పర్యటించారు. తొలుత ఇటీవల అనాసాగారంలో మృతి చెందిన మేళ్లచెరువు సుశీల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నేలకొండపల్లిలో వాసవి భవన్‌లో కార్యకర్తలతో మాట్లాడారు. ఈక్రమంలో ప్రభుత్వ పాఠశాలల స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్.ఇమామ్ ఖాదర్ ఆధ్వర్యాన స్వీపర్ల సమస్యలను పరిష్కరించాలని తుమ్మలకు వినతిపత్రం అందించగా.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఆయన వెంట సర్పంచ్ పి.కరుణశ్రీ,, ఎంపీటీసీ మేళ్లచెరువు అరుణ, పార్టీ జిల్లా నాయకులు సాధు రమేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు ఎనికె జానకిరామయ్య, శాఖమూరి రమేష్, రామచంద్రాపురం సొసైటీ చైర్మన్ గూడవల్లి రాంబ్రహ్మం, నాయకులు సీతారాములు, కడియాల నరేష్, మైశా శంకర్, కొమ్మూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానం.. నాశనం!


కూలిపోయిన వైకుంఠధామం ప్రహరీ


వరద ధాటికి కొట్టుకుపోయిన గది పునాదులు

ముంచెత్తిన వరదలతో మారిన రూపురేఖలు

- పూర్తిగా కూలిపోయిన ఆర్చి, ప్రహరీ
- వరద ధాటికి బయటపడిన పునాదులు
- ఇటీవలే సుందరంగా తీర్చిదిద్దిన వైనం
- కళావిహీనంగా మారిన వైకుంఠధామం

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల వచ్చిన మున్నేరు వరదలకు నగరంలోని ప్రకాశ్‌నగర్‌లో ఉన్న వైకుంఠధామం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. సకల సౌకర్యాలతో నిర్మించిన వైకుంఠధామాన్ని గత నెల 27న వచ్చిన వరదలు నామరూపాలు లేకుండా చేశాయి. ఇక్కడ ఉన్న పెద్ద ఆర్చి, ప్రహరీగోడ, శివుడి నిలువెత్తు విగ్రహం , దహన సంస్కారాలకు వచ్చే వారి అవసరాలకు తగిన విధంగా నిర్మించిన గదులు దెబ్బతిన్నాయి. ఈ వైకుంఠధామం ఏటి ఒడ్డున ఉండడంతో కనీవినీ ఎరుగని రీతిలో వరదలు వచ్చి పూర్తిగా ముంచేశాయి. వరద ధాటికి శ్మశానవాటిక నామరూపాలు లేకుండా పోయింది.

సౌకర్యాలు నిండుగా..

ఇటీవల కాలంలో నగరంలోని వైకుంఠధామాల ఆధునికీకరణలో భాగంగా ప్రకాశ్‌నగర్‌లోని వైకుంఠధామాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దహనసంస్కారాలకు వీలుగా చితులు పేర్చేందుకు గదులతో పాటు కార్యక్రమాలను చూసేందుకు వచ్చిన బంధువులు కూర్చునేందుకు గ్యాలరీలు, అంత్యక్రియలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించేందుకు అవసరమైన స్నానాల గదులు, ఇతర సదుపాయాలు కల్పించారు. 20 అడుగులకు పైగా ఎత్తు కలిగిన శివుని విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా ఉంది.

ముంచిన మున్నేరు..

మున్నేరుకు గతవారం భారీ వరద ఒక్కసారిగా రావడంతో ఏటి పరీవాహక ప్రాంతాలన్నీ వరద నీటిలో మునిగిపోయాయి. కాల్వొడ్డులో గల వైకుంఠధామంలో వాహనాలు మునిగిపోగా.. అంత్యక్రియలు నిర్వహించే గదుల వరకు నీరు చేరింది. అయితే ప్రకాశ్‌నగర్‌లో మాత్రం వైకుంఠధామం అంతా వరద నీటిలో మునిగిపోయింది. శివుని విగ్రహం తలపై భాగం, ఆర్చిపై భాగం కొంత మేరే పైకి కనిపించగా.. గదులు, గ్యాలరీలు, ప్రహరీ అంతా నీటిలో మునిగిపోయింది. ఆ వరద తాకిడికి ప్రహరీ మొత్తం కూలిపోగా.. ఆర్చి పడిపోయింది. ఇక స్నానాల గదులు నేలమట్టం కాగ.. ఇతర గదుల పునాదులు సైతం కొట్టుకుపోయాయి. వరదకు ముందు సకల సౌకర్యాలతో అందంగా ఉన్న ఈ వైకుంఠధామం.. ఇప్పుడు అన్ని కోల్పోయి కళావిహీనంగా.. మట్టి దిబ్బలా మారిపోయింది.

తెలంగాణ సిద్ధాంత కర్త జయశంకర్

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఆదివారం మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు జయశంకర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ తొలి, మలి దశలో ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్


ఖమ్మం సహకారనగర్: జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, సాగర్


ఖమ్మంమయూరిసెంటర్: ధంసలాపురం బ్రిడ్జి సర్కిల్ వద్ద జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


తిరుమలాయపాలెం: మండల పరిషత్ కార్యాలయంలో..


నేలకొండపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ జమలారెడ్డి


ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ బాలుర (బి) వసతిగృహంలో..


ఖమ్మం వైరారోడ్: బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో..

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఖమ్మం వైద్యవిభాగం: నగరంలో జంగాల రాజేశ్వరరావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మయూరిసెంటర్‌లోని సాయిరాం గ్యాస్ట్రో లివర్ ఆస్పత్రిలో నిర్వహించిన శిబిరంలో ప్రముఖ గ్యాస్ట్రంటాలజిస్ట్ జంగాల సునీల్ బాధితులను పరీక్షించి మందులు, ఓపీ ఉచితంగా అందించారు. మొత్తం 123 మందికి స్కీనింగ్ టెస్టులు, హెపటైటీస్ బీ వ్యాక్సినేషన్ నిర్వహించగా.. హెపటైటీస్ పాజిటివ్ ఆరుగురికి గుర్తించారు. అలాగే లివర్ ఫైబ్రో స్కానింగ్ 112 మందికి నిర్వహించారు. ఫౌండేషన్ ఆధ్వర్యాన ప్రతి నెలా మొదటి, మూడో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడుతుందని నిర్వాహకులు జంగాల శ్రీధర్, జంగాల స్వాతి తెలిపారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన..

ఖమ్మం మామిళ్లగూడెం: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన సంచార ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు అన్నారు. ఆదివారం ఖమ్మంలో ఉచిత వైద్య సేవలను వారు ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఖమ్మంతో పాటు చింతకాని మండలం అనాసారం తదితర గ్రామాలలో వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు జిల్లా వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య, సాయినాథ్, తాత రాఘవయ్య, డాక్టర్ హరినాథ్‌బాబు, సింధులు, సత్యనారాయణరెడ్డి, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం శిబిరం


రక్తదానం చేస్తున్న యువకులు

ఖమ్మం స్పోర్ట్స్: ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా నగరంలోని పెవిలియన్‌గ్రౌండ్‌లో సంకల్ప స్వచ్ఛంద సంస్థ, పెవిలియన్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 50 మందికి పైగా యువకులు తలసేమియాతో బాధపడుతున్న నిరుపేదలకు రక్తదానం చేశారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సామినేని సీతయ్య, డాక్టర్ ఆది శంకర్‌రావు, 52వ డివిజన్ కార్పొరేటర్ బుర్రి వెంకట్, దండ పుల్లయ్య, వెంకట్, సుదర్శన్, ఇందిరా, రామనాథం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వన సమారాధన

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువు గ్రామంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకొని గ్రామస్తులు ఆదివారం వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చెట్లల్లోకి వెళ్లి ఆటపాటలతో సందడి చేశారు. చివరగా గ్రామస్తులంతా ఒకేచోట చేరి వన భోజనాలు చేశారు.

ఉద్యోగులకు పీఆర్‌సీ ప్రకటించాలి

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగులకు ఐదేళ్లకోసారి ధరలకు అనుగుణంగా ఇచ్చే పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని టీపీటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వి.మనోహర్‌రాజు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల సాధనకై యూఎస్‌పీఎస్‌సీ ఆధ్వర్యాన ఈ నెల 12న జరిగే ఆందోళన కార్యక్రమం, సెప్టెంబర్ 1న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు పద్మ, ప్రసాదరావు, వీరబాబు, నాగేశ్వరావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

రఘునాథపాలెం: గ్రామ పంచాయతీ కార్మికులు 32 రోజుల నుంచి సమ్మె చేస్తున్న ప్రభుత్వానికి కనికరంలేకుండా పోతుందని, కనీస వేతనాలు అమలుచేయాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య డిమాండ్ చేశారు. ఆదివారం రఘునాథపాలెంలో పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరం వద్ద పాల్గొని సంఘీభావం తెలిపి మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రఘునాథపాలెం మండల కార్యదర్శి కేలోత్ లక్ష్మణ్, జిల్లా నాయకులు జాటోత్ కృష్ణ, లక్ష్మణ్, సురేష్ పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్


ఖమ్మంమామిళ్లగూడెం: నివాళులర్పిస్తున్న బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ ప్రజాసంఘాల ప్రతినిధులు


ఖమ్మంగాంధీచౌక్: మాట్లాడుతున్న జాషువా సాహిత్య వేదిక అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి/ఖమ్మంరూరల్/ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంగాంధీచౌక్: ప్రజాగాయకుడు, కవి, రచయిత, ఉద్యమకారుడిగా ప్రజా ఉద్యమాలు నిర్వహించిన గద్దర్ మృతి తెలంగాణకు తీరని లోటని పలువురు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, జాషువా సాహిత్య వేదిక, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాపం ప్రకటించిన వారిలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, అరుణోదయ నాగన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌లతో పాటు పలువురు కవులు, ప్రజా సంఘాల ప్రతినిధులు వేర్వేరు ప్రకటనల్లో ఘనంగా నివాళులర్పించారు.

భరతనాట్యంలో చిన్నారుల ప్రతిభ

ఖమ్మంగాంధీచౌక్: ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా కేంద్రంలో గల కానాల శ్రీ గురుమూర్తి కళావేదికలో అభినయ నృత్య భారతి ఆధ్వర్యాన శని, ఆదివారాల్లో నిర్వహించిన జాతీయ స్థాయి 'నర్తన బాల–2023'పురస్కారాలు, అభినయ విద్యా పురస్కారాల్లో ఖమ్మంకు చెందిన చిన్నారులు విజేతలుగా నిలిచారు. అభినయ రుద్ర నాట్యాలయంలో శిక్షణ పొందుతూ రెజొనెన్స్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న వీకే నయోనిక(శంభోశివశంభో), రిధి(ప్రభోష సమయమిదే), వైశాలి(స్వామి మీ ఇరంగి అరల్), త్రిశిక(గణపతి శ్లోకం) సోలో ప్రదర్శనలకు పురస్కారాలు లభించాయి. ఈ సందర్భంగా నాట్య గురువు ఫణిల్‌ను నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమ నిర్వాహకులు, సంస్థ అధ్యక్షులు మనోహర్ గోపాల్ లునాని, వ్యవస్థాపక కార్యదర్శి, సేవ్ కూచుపూడి ఆర్టిస్టు, స్టేట్ కో–ఆర్డినేటర్ డి.పూర్ణచందర్ రావుల చేతుల మీదుగా చిన్నారులు పురస్కారాలను అందుకున్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై కొత్తగూడెం వెళ్లిన పుల్లయ్యకు ఆదివారం అభినందన వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను ఎంపీపీ మంగీలాల్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్‌లతో పాటు రెవెన్యూ అధికారులు మెమెంటో అందజేసి సత్కరించారు. డీటీ నర్సింహారావు, ఆర్.ఐ వీరయ్య సొసైటీ వైస్ చైర్మన్ చామకూరి రాజు, సర్పంచ్‌లు కొండబాల వెంకటేశ్వర్లు, గడ్డి కొప్పుల రాజు, లింగన్న, అజీజ్, గౌతమ్, సాధిక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలని రాస్తారోకో


రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

కూసుమంచి: పాలేరు రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 23 అడుగులున్నా పాత కాల్వ ఆయకట్టుకు సాగునీరు అందడంలేదని తక్షణమే నీటిని విడుదల చేయాలని కోరుతూ రైతులు ఆదివారం పాతకాల్వ వద్ద ఖమ్మం–సూర్యాపేట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఖరీఫ్‌లో వరినాట్లు వేసే తరుణం పూర్తవుతోందని, నార్లు పోసుకొని సిద్ధంగా ఉన్నా.. సాగునీరు లేక దుక్కులు దున్నలేక నాట్లు వేసే పరిస్థితి లేదని వాపోయారు. ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి జోక్యం చేసుకొని జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడి వరినార్లు ఎండిపోకుండా చూడాలని కోరారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి వెంటనే స్పందించి సాగునీటి శాఖ అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించారు. దీంతో రైతులు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుల బాబు, ఎర్రబోయిన గాలయ్య, భద్రయ్య, దాసరి వెంకయ్య, గోవిందు, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలు..

భద్రాద్రి జోన్ ఎస్సైగా నవీన్ ఎంపిక..


నవీన్

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెంకు చెందిన మేదర మేట్ల నాగేశ్వరరావు–దేవకర్ణ దంపతుల కుమారుడు నవీన్ ఆదివారం తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటించిన ఫలితాల్లో 265 మార్కులను సాధించి భద్రాద్రి జోన్‌లో ఎస్సైగా ఎంపికయ్యాడు. గతేడాది క్రితం తండ్రి నాగేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినప్పటికీ పట్టుదలతో విజయం సాధించాడు. ఈ సందర్భంగా నవీన్‌ను పలువురు అభినందించారు.

సివిల్ ఎస్సైగా కోటేశ్వరరావు..


కోటేశ్వరరావు

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంకు చెందిన తాళ్లూరి కోటేశ్వరరావు బీసీ(ఏ) విభాగంలో 242 మార్కులు సాధించి సివిల్ ఎస్సైగా ఎంపికయ్యాడు. కోటేశ్వరావు తండ్రి భిక్షం ఎన్నెస్పీలో లస్కర్‌గా రిటైర్ కాగా తల్లి గృహిణి. తమ ఇద్దరు సోదరుల్లో ఒకరు డ్రైవర్, మరొకరు సెంట్రింగ్ పనులు చేస్తుండగా ఎలాగైన ప్రభుత్వం ఉద్యోగం సాధించాలని పట్టుబట్టి సాధించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కోటేశ్వరావును పలువురు అభినందించారు.

ఢిల్లీ గ్రంథాలయ సందర్శన

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా కేంద్ర గ్రంథాలయ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు ఆదివారం ఢిల్లీలోని అంతర్జాతీయ గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ గ్రంథాలయ నిర్వహణపై అక్కడి అధికారులు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నాక మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా గ్రంథాలయంలో అనేక మార్పులు తీసుకురావల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల గ్రంథాలయాల చైర్మన్లు పాల్గొన్నారు.

80 పశువులను కాపాడిన పోలీసులు


పోలీసులకు పట్టుబడిన కంటైనర్

ఖమ్మంఅర్బన్: గోవధ కోసం అక్రమంగా రెండు కంటైనర్లలో హైదరాబాద్‌కు తరలిస్తున్న 80 మూగ జీవాలను శనివారం రాత్రి పోలీసులు కాపాడారు. వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి కంటైనర్లలో అక్రమంగా గోవులను తరలిస్తున్నారన్న సమాచారంతో కూసుమంచి వద్ద పోలీసులు దారి చేసి పట్టుకుని ఖమ్మం గోశాలకు తరలించారు. గోశాల నిర్వాహకుడు, ప్రధాన అర్చకుడు అరుట్ల శ్రీనివాసచార్యులుకు గోవులకు ఆశ్రయం కల్పించాలని నచ్చచెప్పి దింపారు.కాగా, పశువులను కిక్కిరిసి ఎక్కించడంతో దింపే క్రమంలో ఓ గోవు మృతి చెందగా.. మరికొన్నింటికి గాయాలయ్యాయి. ఆదివారం వాటిని వైద్యం అందించినట్లు గోశాల నిర్వాహకుడు తెలిపారు. ఈనేపథ్యంలో గోశాలలో ఇప్పటికే 300లకు పైగా గోవులను సంరక్షణ చేస్తుండగా.. నిత్యం వాటికి సేవతో పాటు పశుగ్రాసం అందించడం పెనుభారంగా మారింది. దాతల సహకారంతో పాటు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చొరవతో కొంతమేర ఉపశమనం కలుగుతుంది. నగర పరిసరాల్లో ఎక్కడ గోవులను పట్టుకున్నా వాటిని టేకులపల్లి గోశాలకు తరలించడంతో ఏటేటా గోవుల సంఖ్య భారీగా పెరగుతుంది. దాతలు ముందుకొచ్చి పశువులకు పశుగ్రాసం, దానా అందించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని శ్రీరామకృష్ణ విద్యాలయానికి చెందిన పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు (1992 బ్యాచ్) వైరారోడ్‌లోని సితార గ్రాండ్ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఇతర దేశాల్లో స్థిరపడిన వారు సైతం హాజరై ఆటపాటలతో సరదాగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకొన్నారు.

ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ..

నగరంలోని ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో చదివిన నాటి పూర్వ విద్యార్థులు(1997–2000 బ్యాచ్) ఆదివారం శ్రీశ్రీశ్రీ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి స్మృతులను నెమరవేసుకుని ఆనందంగా గడిపారు.

కాకరవాయి పాఠశాలలో..


కాకరవాయిలో పాఠశాలలో పూర్వ విద్యార్థులు

తిరుమలాయపాలెం: మండలంలోని కాకరవాయి జిల్లా పరిషత్ పాఠశాలలో 1996–2001 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని, తమ గురువులను ఘనంగా సత్కరించారు.